

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

శుక్రవారం 27 జూన్ 2025


## డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం

**ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ వెంకటేశ్వర్ ... తిరుపతిలో ఘనంగా ర్యాలీ**



5వ పేజీలో



## మట్టి అక్రమ తరలింపుకు... కలెక్టర్ అనుమతులు ఇచ్చారట?

- తూకివాకం చెరువులో ఏర్పడిన గోతులు.
- జాతీయ రహదారి పనులు అంటూ కలెక్టర్ పేరుతో బుకాయింపు.
- ఏఈని వివరణ కోరగా అంతా డిఈఈ ఎరుక
- డిఈఈ ప్రకాష్ రావు... వివరణ
- కథనంకు అనుమతి పత్రాలు అడిగితే నేను ఇవ్వను అంతా నాఇష్టం అంటూ బెదిరింపులు, రాసుకుంటావో రాసుకో...
- కాసులకు కకృతి పడి గుత్తేదారులతో కుమ్మక్కయిన బి డి.ఈ.ఈ ప్రకాష్ రావు.

**రేణిగుంట మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి పనుల పేరుతో కొందరు అక్రమార్కులు చెరువు మట్టిని తొవ్వుకుని వాళ్ల జేబులు నింపుకుంటున్నారు. వీరికి ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సంపూర్ణంగా వత్తాసు పలుకుతూ కనీసం కన్నెత్తి చూడకుండా వ్యవహరిస్తున్న ఘటన రేణిగుంట మండలం తుకివాకం పంచాయతీ కార్యాలయానికి అనుకొని, జాతీయ రహదారి 71 ఆనుకొని ఉన్న 14 ఎకరాల చెరువులో పగలు రాత్రి అన్న తేడా లేకుండా జెసిబిలతో చెరువు మట్టు తరలిస్తున్న ఘటన. గత కొద్ది నెలలుగా ఇంత తంతు జరుగుతున్న అటూ రెవెన్యూ శాఖ అధికారులు, చెరువులకు సంబంధించిన ఇరిగేషన్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి పనుల పేరుతో ఆక్రమార్కులు చేస్తున్న దోపిడీకి, ధన దాహానికి జలవనరులు అల్లాడుతున్నాయి. ఈ చెరువు ప్రాంతంలో జెసిబి లు సాయంతో చేపడుతున్న తవ్వకాలుకు బావులను తలపించేలా ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో

మిగతా 2లో

### జిల్లా విద్యాశాఖలో

## కింగ్ మేకర్ పార్ట్ -1



- జిల్లా విద్యాశాఖ నా ఆగడాలకు అడ్డా...
- నన్ను అడ్డుకునే నాధుడు ఎవరు....
- కింగ్ మేకర్‌కు అండగా ఇద్దరు ప్రధాన సిబ్బంది...
- అంతర్ ఉద్యోగుల బదిలీల్లో కింగ్ మేకర్‌కు అందిన భారీ నజరానా.....
- నజరానాల వసూళ్లకు కేంద్రంగా టీ కొట్టు...
- ఏడి స్థాయిలో నిబంధనలకు తూట్లు...
- కింగ్ మేకర్ కుడి భుజంగా మరో సుమారు 18 సంవత్సరాల లాంగ్ స్టాండ్ సీనియర్ అసిస్టెంట్...

**చిత్తూరుబ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లా విద్యాశాఖను తన చెప్పుడు చేతుల్లో పెట్టుకొని అరాచకం సృష్టిస్తున్న కింగ్ మేకర్ ప్రస్తుతం తనను ఎవరు అడ్డుకోలేరని జిల్లా విద్యాశాఖ తనకు తన ఆగడాలకు అడ్డా అని బహిరంగంగానే చెబుతున్నాడు. నా స్థాయి సీనియర్ అసిస్టెంట్ అయిన నా చెప్పుడు చేతుల్లో ఏ. డి స్థాయి అధికారులు కొందరే కాకుండా రీజనల్ స్థాయి, రాష్ట్రస్థాయి లో పనిచేసే అధికారులు కూడా ఉన్నారని వారిని నా సోల్జర్ గా వాడుకుంటూ తన ఆటను కొనసాగిస్తే నాపై చర్యలు తీసుకునే ధైర్యం ఎవరికి ఉందని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బహిరంగంగా చెప్పుకోవడం గురువారం చోటుచేసుకుంది. ఈ కింగ్ మేకర్ కు తోడుగా ఓ అడిషనల్ డైరెక్టర్ స్థాయి అధికారి కుడి భుజంగా మరో సీనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బంది ఎడమ భుజంగా ఉండడంతో వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవినీతి అరాచకాలు చోటు చేసుకుంటున్నాయని కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందే కాకుండా జిల్లా విద్యాశాఖలో వివిధ పనుల కోసం వచ్చే ప్రైవేటు విద్యాసంస్థల్లో మరికొందరు బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జరగవలసిన ఏ పనికైనా కూడా వీరు వక్ర భాష్యం చెబుతూ వారు అనుకున్నదే జరిగే విధంగా ఉన్నత అధికారిని మభ్యపెట్టి తమ పనులు చక్కదిద్దు కుంటున్నట్లు తెలియ వచ్చింది. ప్రధానంగా ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టర్ వన్ అడిషనల్ డైరెక్టర్ 2 అనే రెండు పోస్టులు కలిగి ఉన్నాయి. ఇందులో జిల్లా విద్యాశాఖకు సంబంధించి అన్ని అడ్మినిస్ట్రేషన్ పనులను అనగా ఉపాధ్యాయులకు సంబంధించి బదిలీలు, డిప్యుటేషన్లు, జీతబత్యాలు, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఎక్స్ట్రా ఎక్స్ట్రా అన్ని అడిషనల్ డైరెక్టర్ వన్ గా ఉండే అధికారికి ఉంటుంది. రెండవ అడిషనల్ డైరెక్టర్కు ఇదే శాఖలో మధ్యాహ్న భోజనం, పాఠశాలల అభివృద్ధి, ప్రభుత్వ అభివృద్ధి పనులు తదితర వాటికి సంబంధించి చూడవలసిన బాధ్యత ఉంటుంది అయితే ఈ కింగ్ మేకర్ అండదండలతో ఇక్కడ ఒకరు చేయవలసిన పని మరొకరు చేస్తున్నట్లు తెలియ వస్తుంది. అలాగే సుమారు 18 సంవత్సరాల పాటు ఒకే కార్యాలయంలో బదిలీ వచ్చిన వెళ్లకుండా కేవలం కాగితాలతోనే సరిపెట్టుకొని కొన్ని సంవత్సరాల పాటు డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తు ప్రస్తుతం రెగ్యులర్గా ఇక్కడే పోస్టింగ్ తెచ్చుకున్నట్లు తద్వారా కింగ్ మేకర్ కు ఎడమ భుజంగా ఉన్న ఓ సీనియర్ అసిస్టెంట్ మొన్నటి వరకు జరిగిన ఉపాధ్యాయ కౌన్సిలింగ్ లో సైతం అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అలాగే కింగ్ మేకర్ తో పాటు ఈ ఇద్దరు అంతర్ ఉద్యోగుల బదిలీల్లో కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా స్థాయి ఉన్నతాధికారిని మభ్యపెట్టి తమకు ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తద్వారా లక్షల రూపాయలను అర్జించి పాత బస్టాండ్ సమీపంలోని పొన్ని అమ్మ దేవాలయం ఎదుట గల టీ కొట్టు కేంద్రంగా పంచుకున్నట్లు గుసగుసలు వినిపిస్తోంది. సాధారణంగా అంతర్ రంగ ఉద్యోగుల బదిలీలు ఐదు సంవత్సరాలు దాటిన వారికి

మిగతా 2లో

## సూళ్లూరుపేటలో రూ.2 వేల నోట్ల మార్పిడి మోసం

- నలుగురి అరెస్ట్... రూ. 73 లక్షల నగదు స్వాధీనం... రూ.2000 దొంగ నోట్ల కట్టలు సీజ్..
- ఐదు సెల్ ఫోన్లు, రెండు ఇన్నోవా కార్లు స్వాధీనం..
- ఇలాంటి మోసాల బారిన పడవద్దు : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** 2000 రూపాయల నోట్ల కరెన్సీ మార్పిడి మోసాన్ని సూళ్లూరుపేట పోలీసులు బట్టబయలు చేశారు. ఈ ఘటనలో నలుగురి నిందితులను అరెస్టు చేయడంతో పాటు 73 లక్షల 20 వేల నగదు తో పాటు రెండు ఇన్నోవా వాహనాలను, ఐదు సెల్ ఫోన్ లను సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

మిగతా 2లో

## కలెక్టర్‌గారు స్పందించండి...

- పంచాయితీ అప్రూవల్ లేకుండా లే అవుట్ . పట్టించుకోని శ్రీకాళహస్తి రెవెన్యూ. మండల పరిషత్ యంత్రాంగం..

4లో

## మామిడి రైతులకు సబ్సిడీ పై అవగాహన కల్పించండి

- చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

8లో


సూర్య 19 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సూర్య యాజమాన్యానికి, పాఠకులకు, నగర ప్రజలకు శుభాకాంక్షలు

RATNAM SCHOOL

TIRUPATHI.

# కింగ్ మేకర్ పార్ట్ -1

**మొదటిపేజీ తరువాయి....**

వర్తిస్తుంది ఒకవేళ ఐదు సంవత్సరాలు పూర్తికాని వారు బదిలీ కావాలనుకుంటే వారు లిఖితపూర్వకంగా జిల్లా స్థాయి అధికారికి వినతి పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే వారికి బదిలీలు చేయవలసి ఉంటుంది. అయితే ఈ ముగ్గురు ఈ బదిలీల్లో తమకు అనుకూలంగా ఉన్న వారి కోసం ఇష్టానుసారం ఏదో కుంటి సాకులు చూపుతూ ఐదు సంవత్సరాలు పూర్తికాని అటెండర్ స్థాయి సిబ్బందిని సైతం మార్చివేసి అనుకూల వద్ద భారీ మొత్తంలో నగదు తీసుకున్నట్లు కూడా ఆరోపణలు చెక్కర్లు కొడుతున్నాయి. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి జరిగిన బదిలీల కౌన్సిలింగ్ నందు కూడా ఈ ముగ్గురు తమ పావులను కలదిపి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలిసింది. కౌన్సిలింగ్ ద్వారా ప్లేస్మెంట్లు కోరుకునే ఉపాధ్యాయులకు సంబంధించి ప్రభుత్వం కొన్ని సడలింపులను ఇవ్వడం జరిగింది అందులో అనారోగ్యంగా ఉన్నవారు, అనారోగ్య కారణంగా ఆపరేషన్లు చేసుకున్న వారికి సంబంధించి ప్రిఫరెన్స్ ఆప్షన్‌ను ఇవ్వడం జరిగింది. దానిని కౌన్సిలింగ్లో ఎంచుకుని మరల వద్దనుకుంటే డిలీట్ ఆప్షన్ ను కూడా ఇవ్వడం జరిగింది. ఈ మేరకు డిలీట్ చేసుకున్న ఉపాధ్యాయులకు జనరల్ ట్రాన్స్ఫర్ నందు కోరుకునే ప్లేస్మెంట్ రావాలి అయితే ప్రిఫరెన్స్ ఆప్షన్ ను డిలీట్ చేసుకున్న వారికి జనరల్ ట్రాన్స్ఫర్ నందు కోరుకున్న ప్లేస్మెంట్ రాకపోవడంతో సుమారు 70 మందికి పైగా ఉపాధ్యాయులు ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన ఈ ముగ్గురు అనుకున్న ప్లేస్మెంట్ రాని వారిని మభ్యపెట్టి మీకు ఏ ప్లస్ కావాలో ఆ ప్లేస్మెంట్ ను రివైజ్డ్ పద్ధతిలో కల్పిస్తామని చెప్పి వారి వద్ద కూడా సుమారు 25 లక్షలు వరకు వసూలు చేసుకున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వీరి ఆగడాలు తవ్వేకొద్దీ వస్తూనే ఉండడంతో ఈ కింగ్ మేకర్‌తో పాటు మరో ఇద్దరు గురించి మరో సంచికలో నేటి దినపత్రిక సూర్య పాఠకులకు తెలియజేయునన్నాము...అలాగే ఇదే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సుమారు 28 ఏళ్ల పైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఓ సత్య హరిశ్చంద్రుని గురించి కూడా నేటి దినపత్రిక సూర్య మీ ముందుకు తీసుకు రానున్నది.

# వర్షాల పట్ల.అప్రమత్తంగా ఉండండి : కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని 15వ వార్డు లోని పద్మావతి పార్క్ , పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజూ చెత్త బండి వస్తోందా, త్రాగునీరు సకాలంలో వస్తున్నాయా అనే విషయాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని అన్నారు. వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా మురుగునీటి కాలువల్లో చెత్తను తొలగించాలని అన్నారు. దోమలు ప్రబలకుండా మందులు పిచికారీ చేయించాలని అన్నారు. పద్మావతి పార్కులోనీ వాకింగ్ ట్రాక్ లో గుంతలను సరి చేసి, శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే అన్నా క్యాంటీన్ ను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, ఏసిపి బాలాజి, డి.ఈ.లు మహేష్, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# 18 ఏళ్ళ తరువాత ఎమ్మెల్యే చొరవతో సంపుకు మహర్దశ



**సూళ్లూరుపేట రూరల్, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట పురపాలక సంఘం ప్రజలకు దాహార్తిని తీర్చడం కోసం 2007 సంవత్సరం లో ప్రారంభించి నిరుపయోగంగా వదిలేసిన సంపు ను 18 ఏళ్ళ తరువాత సూళ్లూరుపేట నియోజిక వర్గం ఎమ్మెల్యే డాక్టర్. ఎన్. విజయశ్రీ చొరవతో ఉపయోగంలోకి తీసుకువచ్చి మున్సిపాలిటీ వారు ఒక అద్భుతానికి శ్రీకారం చుట్టారు, నెలవల విజయశ్రీ, పట్టణ ప్రజలకు త్రాగునీటిని అందించాలన్న సంకల్పంతో మునిసిపల్ అధికారులతో సమీక్షించి ఈ సంపును పాత నీళ్ల ట్యాంకుకు జోడించి త్రాగునీటిని అందించడానికి శ్రీకారం చుట్టారు, మునిసిపల్ కమీషనర్ చిన్నయ్య పర్యవేక్షణలో ఇప్పుడు గాండ్ల వీధిలో నిరుపయోగంగా ఉన్న సంపు లోకి నీటిని వదిలి సంపులో నుండి ప్రక్కనే ఉన్న పాత నీటి ట్యాంకు కు త్రాగునీరు ఎక్కించి పట్టణ ప్రజలకు దాహార్తిని తీరుస్తున్నారు , నిరుపయోగంగా పడిఉన్న నీరు నిల్వ చేసుకునే సంపును ఉపయోగం లోకి తెచ్చిన మున్సిపాలిటీ వారు అభినందనీయులు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం - మేము సైతం



**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈగల్ క్లబ్ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరము ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ సిఎన్ లత, క వైస్ ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు సుబ్బారావు, హరిబాబు, బాబు,భార్గవి, వ్యాయామ శాఖ అధ్యాపకులు జోగి ప్రసాద్, అధ్యాపకేతర సిబ్బంది రాజా, అరుణ, మరియు విద్యార్థులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి అక్రమ తరలింపుకు... కలెక్టర్ అనుమతులు ఇచ్చారట?

**మొదటిపేజీ తరువాయి....**



బారీ యంత్రాలతో చెరువు గర్భాలను చీల్చి చెండాతూ మట్టిని పది యూనిట్ల టిప్పర్లతో ప్రైవేట్ వెహికల్ వేస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఈ తవ్వకాలతో ఇక్కడ లోతైన గోతులు ఏర్పడుతున్నాయి.

**కన్నెత్తి చూడని ఇరిగేషన్ శాఖ అధికారులు...**

సాధారణంగా చెరువులు, చెరువుల మట్టి ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు గుత్తేదారులు ఇచ్చి కాసులు కుక్క కక్కుర్తి పడి తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఇరిగేషన్ శాఖ ఏఈ, డి.ఈ.ఈ అధికారులకు స్థానిక పంచాయతీ ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ నిమ్మకు నిమ్మకు నీరుఎత్తినట్టు వ్యవహరిస్తున్నారని బహిరంగంగా చెబుతున్న పంచాయతీ ప్రజలు. ఈ అక్రమ తవ్వకాలపై ఇరిగేషన్ శాఖ ఏఈ హరికృష్ణ సంప్రదించగా ఆ చెరువులో మరియు మండలంలో జరిగే చెరువు మట్టి తవ్వకాల పనులకు సంబంధించి తనకేం తెలియదు అంతా డి.ఈ.ఈ ప్రకాష్ రావుకు అంతా తెలుసు కావాలంటే ఆయన సంప్రదించుకోండి అంటూ సమాధానం.

**డి.ఈ.ఈ ప్రకాష్ రావు బెదిరింపు సమాధానం....**

ఈ చెరువు మట్టి అక్రమ తవ్వకాలపై డి.ఈ.ఈ ప్రకాష్ రావును చరవాణిలో సంప్రదించుగా జాతీయ రహదారి పనులకు సంబంధించి తవ్వకాలు చేపట్టేందుకు నేనే అనుమతులు ఇచ్చాను ఇప్పుడు ఏమి...? అంటూ నిర్లక్షపు సమాధానం. అనుమతులకు సంబంధించి పత్రాలు చూపించండి కోరగా నాకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు, అని సమాధానం. అలా అయినా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు చూపించాలని కోరగా నేను చూపించను ఆధారాలు ఇవ్వను అంతా నా ఇష్టం నీకు నచ్చింది ఏం రాసుకుంటావో రాసుకో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్న డి.ఈ.ఈ ప్రకాష్ రావు.

**ఉపాధి హామీ కూలీలు పొట్టకొడుతున్న ఇరిగేషన్ శాఖ...**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు జీవనోపాధి భద్రతను పెంపొందించడం ద్వారా ప్రతి కుటుంబ స్వచ్ఛంద సేవకుడికి నైపుణ్యం లేని చేతి పని చేయడానికి ఏడాది పొడవునా ఉపాధిని కల్పించడం అందులో భాగంగా చెరువు ప్రాంతాలలో కూలీల ద్వారా పనులు చేపించి వారికి ఉపాధి కల్పించాలి. పథకానికి శాఖ అధికారులు తూట్లు పొడుస్తూ జాతీయ రహదారి గుత్తేదారులతో అలగే చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కయి వారు ఇచ్చే కాసులకు కక్కుతి పడి ఇష్టానుసారంగా జెసిబి యంత్రాలతో టిప్పర్లతో గోతులు పడేలా మట్టిని తువెందుకు సహకరించడం వల్ల ఉపాధి హామీ కూలీల పొట్ట కొడుతున్నరన్నురని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువుపైన సుమారు 400 మంది ఉపాధి హామీ కూలీలు ప్రతిఏటా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇకనైనా సంబంధిత ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారులు ఈ చెరువు మట్టి అక్రమ రవాణా పై మరియు వారికి సహకరిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# సూళ్లూరుపేటలో రూ.2 వేల నోట్ల మార్పిడి మోసం

**మొదటిపేజీ తరువాయి....**



తెలిపారు. గురువారం తిరుపతిలోని పోలీస్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు వివరాలను వెల్లడించారు. సూళ్లూరుపేటకు చెందిన జగదీష్ డబ్బుల అత్యాశకు పోయి మధ్యవర్తుల సాయంతో 500 రూపాయల నోట్లకు, పాత 2000 రూపాయల నోట్ల రెండు రెట్లు అధికంగా ఇస్తామని నిందితులు నమ్మబలికారు. నోట్ల మార్పిడి అంతా పక్క లీగల్ అని వారు జగదీష్ కు తెలిపారు. దీంతో జగదీష్ మధ్యవర్తుల సాయంతో రెండు ఇన్నోవా కార్లలో కొంతమంది గత నెల 7వ తేదీ జగదీష్, అతని స్నేహితులకు కోటి రూపాయలకు రెండు కోట్లు ఇస్తామని జాతీయ రహదారిపైకి పిలిపించుకున్నారు. ఐదు మంది నిందితులలోని ఒక వ్యక్తి తన పిఏగా చెప్పుకొని జగదీష్ తో పాటు అతని స్నేహితుల దగ్గరికి వెళ్లి రెండున్నర కోటి ?2000 నోట్లు ఇస్తారు అని నమ్మ పలికించి డైవర్ట్ చేశారు. దీంతో జగదీష్ వద్దనున్న 500 రూపాయల అసలు నగదు కోటి రూపాయలను తీసుకొని నిందితులు ఊడయించేందుకు సిద్ధమయ్యారు. చీటింగ్ అని పసికట్టిన జగదీష్ వారిని కారును ఆపేందుకు ప్రయత్నించగా జగదీష్ ను పక్కకు నెట్టి పారిపోయారు. దీంతో బాధితుడు జగదీష్ సూళ్లూరుపేట పోలీసులను ఆశ్రయించారు. డి.ఎస్.పి చెంచు బాబు, సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ చీటింగ్ కేసును ఛాలెంజ్ గా తీసుకొని నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీం లను ఏర్పాటు చేశారు. నిందితుల వివరాలతో సెల్ఫోన్ ట్రాకింగ్ ల ఆధారంగా నిందితులను ఈనెల 25వ తేదీ భూదానం టోల్గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 73 లక్షల ఇరవై వేల నగదు తో పాటు చీటింగ్ కు వినియోగించిన రెండు ఇన్నోవా కార్లను, 2000 రూపాయల నకిలీ నోట్ల కట్టలు 6, వైఫై మోడ్ ఎం, ఐదు సెల్ ఫోన్ లను సీజ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో అంబటి సంతోష్ అలియాస్ చిన్న స్వామి శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ టౌన్ కు చెందిన 37 సంవత్సరాల వ్యక్తి. ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా కు చెందిన బర్రి రవితేజ ఆలియాస్ రవి, తిరుపతికి చెందిన దుర్గారావు కుమారుడు హేమకరరావు, విశాఖపట్నం సిటీ కంచరపాలెం కు చెందిన ముమ్మిడి ఉమా మహేష్ అలియాస్ ఉమా లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అలాగే ఇదే ముఠాకు చెందిన బాపట్ల జిల్లా కర్లపాలెం కు చెందిన దుంతి రెడ్డి హరిబాబు రెడ్డి అలియాస్ హరి పరారీలో ఉన్నారు. వీరిని అరెస్టు చేయడంలో ప్రత్యేక ప్రతిభ కనపరిచిన సూళ్లూరుపేట సిఐతో పాటు ఎస్ఐలు బ్రహ్మానాయుడు అజయ్ బాబు, కొండప్ప నాయుడు, ఏఎస్ఐ కుమార్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి కానిస్టేబుల్ సురేష్ చిరంజీవి, సుహేల్ బాబు లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి నగదు క్యాష్ రివార్డులను అందజేశారు. ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూనే ఉన్నామని, అయినా నిందితులు చెప్పే మాటలకు నమ్మి వారి వలలో పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి మోసాల బారిన పడవద్దని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పి లు రవి మనోహర ఆచారి, వెంకటరావు, సూళ్లూరుపేట డిఎస్పి చెంచు బాబు, మురళీకృష్ణ తో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ సాదిక్ అలీ, ఎస్సైలు పాల్గొన్నారు.

# కోటలో అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవం ర్యాలీ




**కోట, మేజర్‌న్యూస్ :** కోటలో అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి క్రాస్ రోడ్డు నెహ్రూ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాయక్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎస్ఐలు మాట్లాడుతూ... డ్రగ్స్ తీసుకో వడం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దన సూచించారు. అనంతరం గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కోట ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కోట పోలీసు సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, ఏపిఎం, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఐసీడీఎస్ సిడిపిఓ, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ వైద్యులు, ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ ధర్మరాజులు స్వామి బ్రహ్మోత్సవాలు

**- ఈవో టి బాపిరెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :**
శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం 27.06.2025 శుక్రవారం నుండి తేది.09.07.2025 బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించదును అని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో పీ బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు కార్యక్రమాలు వివరములు 27.06.2025 శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుండి 3 గంట వరకు పాండవ జననం, కౌరవ జననం కథ, సాయంత్రం 4గంటలకు అంకురార్పణ, 5 గంటలకు ధ్వజారోహణం. 28.06.2025 శనివారం రాత్రి 9 గంటలు నుండి ఉదయం 5 గంటలు వరకు పాండవ విద్యా భ్యాసం కార్యక్రమం జరుగుతుంది. 29.06.2025 ఆదివారం సాయంత్రం 6 గంటలు నుండి 6 గంటలు వరకు హిడింబాసురా బకాసురవధ కార్యక్రమం జరుగుతుంది. 30.06.2025 సోమవారం రాత్రి 9 గంటలు నుండి ఉదయం 5 గంటలు వరకు మత్స్య యంత్ర చేదనం కార్యక్రమం జరుగుతుంది. 01.07.2025 మంగళవారం రాత్రి 8 గంటలు నుండి 9 గంటలు వరకు ద్రౌపతీ కళ్యాణం జరుగుతుంది. 02.07.2025 బుధవారం రాత్రి 9 గంటలు నుండి ఉదయం 5 గంటలు వరకు రాజసూయ యాగం



కార్యక్రమం జరుగుతుంది. 03.07.2025 గురువారం రాత్రి 9 గంటలు నుండి ఉదయం 5 ఒక గంటలు వరకు ద్రౌపది వస్త్రాపహరణం కార్యక్రమం జరుగుతుంది. 04.07.2025 శుక్రవారం సాయంత్రం 4 గంటలు నుండి 5 గంటలు వరకు అర్జున తపస్సు, రాత్రి 12 గంటలకు అలుగు కుంభాగ్రమున నిలుపుట కార్యక్రమం జరుగుతుంది. 05.07.2025 శనివారం రాత్రి 7 గంటలు నుండి ఉదయం 11 గంటలు వరకు ఉత్తర గోగ్రహణము, అర్జునుడు ఆవులు మలవేయుట కార్యక్రమం జరుగుతుంది. 06.07.2025 ఆదివారం ఉదయం 9 గంటలు నుండి 10 గంటలు వరకు దుర్యోధన, దుశ్శాసన వధ, అమ్మవారి కురులు ముడి వేయుట కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండం ప్రవేశం, అగ్నిగుండం రోజున అమ్మవారికి పూలజడ కైంకర్యం కార్యక్రమం జరుగుతుంది. 07.07.2025 సోమవారం ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 7 గంటలకు ధ్వజా అవరోహణం కార్యక్రమం జరుగుతుంది. 08.07.2025 మంగళవారం సాయంత్రం 5 గంటలకు కుంభం. 09.07.2025 బుధవారం ఉదయం 9 గంటలు నుండి 5 గంటలు వరకు పార్వేట ఉత్సవం. బ్రహ్మోత్సవం దినములలో ప్రత్యేక కార్యక్రమములు జరుపడతాయని తెలిపారు. 16.06.2025 సోమవారం నుండి 06.07.2025 ఆదివారం వరకు ప్రతినిత్యం మధ్యాహ్నం 2 గంటలకు పురాణ కాలక్షేపం జరుగును. తేది.27.06.2025 తేది.06.07.2025 ఆదివారం వరకు ప్రతినిత్యం రాత్రి 9 గంటలు నుండి భారత రంగస్థలం నాటకములు వేయబడును. 1వతేదీ మంగళవారం రాత్రి 8 గంటలు నుండి ద్రౌపతీ కళ్యాణం, ఆ రోజున మొక్కు బడులు ఉండు వారు మ్రొక్కు బడులు చెల్లించు కొనవచ్చును అని తెలిపారు. 4 వతేదీ శుక్రవారం నుండి మ్రొక్కుబడులు, కంకణములు కట్టు కొన వచ్చును అని తెలిపారు. 6 వతేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండం ప్రవేశం జరుగుతుందని తెలిపారు. శ్రీకాళహస్తి చుట్టు పక్కల భక్తులు సదరు కార్యక్రమములలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవార్ల కృపాకటాక్షములకు పాత్రులు కాగలరని కోరారు.

# మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం బిఎంపీడీవో ప్రభురావు




**రేణిగుంట, మేజర్ న్యూస్:**
మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషిచేయాలని రేణిగుంట ఎంపీడీవో ప్రభు రావు పేర్కొన్నారు. గురువారం రేణిగుంట పట్టణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యనిర్మూలన దినోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధికారులు, తెదేపా నాయకులు, ఆశ వర్కర్లు, సంఘాల మహిళలు చేరుకొని మాదకద్రవ్యాల నివారణ ర్యాలీని చేపట్టారు. అనంతరం బాలుర హైస్కూల్ వద్ద విద్యార్థులకు మాదకద్రవ్యాల భారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థితులు పొందాలని సూచించారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని మన చుట్టూ జరుగుతున్నటువంటి కొన్ని అనైతిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి యువత డ్రగ్స్ గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం మండల అధికారులు, ఎంఈఓ రంగనాథం, పాఠశాల ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు, విద్యార్థులు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : డిసిహెచ్‌సి పద్మాంజలి

**కార్వేటినగరం మేజర్ న్యూస్:**
కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసిహెచ్‌సి పద్మాంజలి అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఎన్ని మంది రోగులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వస్తున్నారు. వారికి ఎటువంటి వైద్య సేవలు అందిస్తున్నారు అన్నవిషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు, ల్యాబ్ ఫార్మసీ, ఎన్ని మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, ఎన్నిమందికి కాన్పులు చేస్తున్నారు రికార్డులను పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు ఎటువంటి వైద్యసేవలు అందిస్తున్నారని అంశాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. 50 పడకల ఆసుపత్రి నిర్మాణంని పరిశీలించారు, భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. అనంతరం



రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భాగ్యలక్ష్మి, వైద్యులు శృతి భాగ్యం, శృతి, యూసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీ ఉద్యోగులకు 2వేల హెల్మెట్లు పంపిణీ

**తిరుమల, మేజర్ న్యూస్:**
టీటీడీ ఉద్యోగులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సీవీఎస్వో మురళీ కృష్ణతో కలిసి గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇటీవలే 500 హెల్మెట్లు పంపిణీ చేశామని, అమలాపురానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్ కు చెందిన నాగేంద్ర ప్రసాద్ అనే దాతలు విరాళంగా ఇచ్చిన 2 వేల హెల్మెట్లు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరో 7500 హెల్మెట్లు టీటీడీ ఉద్యోగులకు అందిస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని ఆయన కోరారు. టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు అందిస్తున్న హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. హెల్మెట్లు ధరించడంపై అలిపిరి, ఘాట్‌రోడ్ల వద్ద ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం తిరుమలకు వచ్చే భక్తులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సదాలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత నవ సమాజాన్ని నిర్మిద్దాం

**దొరవారిసత్రం, మేజర్ న్యూస్ :**



తిరుపతి జిల్లా దొరవారిసత్రంలో మాదకద్రవ్య దుర్వినియోగం మరియు వ్యతిరేక దినం సందర్భంగా గురువారం ఏకొల్లు జిల్లా పరిస్థితి హై స్కూల్ ఆవరణము నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో,పోలీస్ సిబ్బంది ఎంపీడీవో సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించి లిడ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దులి అనే నినాదంతో ప్ల కార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లడం జరిగినది అనంతరం సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశమని, యువత డ్రగ్స్ కు అలవాటు పడి బంగారు లాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్ పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతున్నారని, మీ చుట్టుపక్కల డ్రగ్స్ ఉన్నట్టుగానీ, తీసుకుంటున్నట్టు మీకు తెలిసినట్లయితే వెంటనే 1972 నెంబర్ కు ఫోను చేసి మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్ ఎస్సై అజయ్ కుమార్,హౌసింగ్ ఏఈ మోహన్,ఏపిఎం మునిరాజా,అంగనవాడి సూపర్వైజర్ అంకమ్మ, ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవయ్య, తదితరులు పాల్గొని ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది,

## విభిన్న ప్రతిభావంతులకు
# కృత్రిమ కాలు కొలతలకై క్యాంపు నిర్వహణ

**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్ :**
చిత్తూరు, తిరుపతి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు జులై 5వ తేదీ శనివారం విశాల్ మార్ట్ ప్రక్కన, తపోవనంలో, చిత్తూరు నందు కృత్రిమ కాలు క్యాంప్ నందు కాలు కొలతలు తీసుకొవడం జరుగును. ఇదివరకు కృత్రిమ కాలు తిసుకోన్న లబ్దిదారులు ఈ క్యాంపు కు రావలసిన అవసరం లేదు. ఇంతకు ముందు తీసుకోని వారు కొత్తగా కృత్రిమ కాలు కావలసిన వారు ఈ క్యాంపు కు హాజరు కాగలరని,మరల 20 రోజుల తరువాత ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడును. కావలసిన వారు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతభా వంతులు, హిజ్రా అండ్ వయోవృద్ధుల సంక్షేమ శాఖ, నూతన కలెక్టరేట్ భవన సముదాయము, అంబేద్కర్ భవనము, రెడ్డిగుంట, చిత్తూరు క్రింద కనపరచిన సిబ్బంది వారి ఫోన్ ద్వార సంప్రదించి మీ యొక్క పేరును నమోదు చేసుకోవలసి నదిగా కోరడమైనది. మీరు క్యాంప్ దగ్గరకు వచ్చేముందు ఈ క్రింది జిరాక్స్ పేపర్స్ రెండు జతలు తీసుకొని రావాల్సిందిగా తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు జి. ఆర్. రాజశేఖర్ నాయుడు, 9440357522, సి ఆర్ అండ్ యం వో సోహెల్ అబ్బాస్, సీసీటీ 6281486722 సహాయ సంచాలకులు, విభిన్న ప్రభావంతులు,హిజ్రా అండ్ వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏ డి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మాదకద్రవ్య మహమ్మారిని తరిమికొట్టాలి

**- మాదక ద్రవ్యాల అనర్థాల పై అవగాహన ర్యాలీ**
**- డీఎస్పీ పార్థసారథి**

**కుప్పం, మేజర్ న్యూస్ :**






అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కుప్పం పట్టణంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం డీఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత భయంకరమైనదని అన్నారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతిపెద్ద సమస్యగా మారిందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెడు స్నేహాల వలన మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత తమ భవిష్యత్తు తామే నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా సందేశాన్ని వ్యాప్తి చేయడానికి మరియు పోరాడటానికి ప్రభావవంతమైన అవగాహన కార్యక్రమాలు, ప్రజా భాగస్వామి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. యువతలో మార్పు తీసుకురావడం ద్వారానే డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న సినీ నిర్మాత బండ్ల గణేష్

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని సినీ నిర్మాత బండ్ల గణేష్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

## కలెక్టర్‌గారు స్పందించండి...

### - పంచాయితీ అప్రూవల్ లేకుండా లే అవుట్
### - పట్టించుకోని శ్రీకాళహస్తి రెవెన్యూ, మండల పరిషత్ యంత్రాంగం..



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు రెవెన్యూ సర్వే నెంబర్ 254/4ఎ. 254.4ఎ.254/ 4ఎలలో రెండు ఎకరాలలో పంచాయతీ అప్రూవల్. తుడ అప్రూవల్. పర్మిషన్ లేకుండా లేఔట్ వేసి ప్లాట్లు విక్రయాలు మొదలు పెట్టారు. తెలుగుదేశం. వైసిపి నాయకులు సిండికేట్ గా ఏర్పడి పంచాయితీ అప్రూవల్ తీసుకోకుండా లేఅవుట్ వేసి ప్లాట్లు బిజినెస్ చేస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చుక్కల నిడిగెళ్ళు రెవెన్యూలో అక్రమ లేఅవుట్ పై చర్యలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. దీనిపై చుక్కల నిడిగల్లు పంచాయతీ సర్పంచ్ చుక్కల కిరణ్ ను వివరణ కోరగా అక్రమ లేఔట్ విషయం నా దృష్టికి వచ్చింది. మా పంచాయతీ కార్యాలయంనకు ఎటువంటి సంబంధం లేకుండా లేఅవుట్ వేసారని తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులకు. మండల పరిస్థితి అధికారులకు ఫిర్యాదు కూడా ఇవ్వడం జరిగింది. రెవెన్యూ అధికారులు స్పందించలేదని తెలిపారు. ఈ సర్వే నెంబర్ లో ఎకరా భూమి 3 కోట్లు విలువ ఉంటుంది. ఈ అక్రమ లేఔట్ వలన గ్రామ పంచాయితీకి సుమారు 3 లక్షలు రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు. శ్రీకాళహస్తి వైఎస్ఆర్ పార్టీ నాయకుడు ఢిల్లీ బాబు రెడ్డి. కొంత మంది తెలుగుదేశం పార్టీ నాయకులు సిండికేట్ గా ఏర్పడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అండ్ మండల పరిషత్ సిబ్బంది వెంటనే స్పందించి అనధి కారికంగా వెలిసిన అక్రమ లేఔట్ పై చర్యలు తీసుకోవాలని పంచాయతి ప్రజలు కోరుతున్నారు.



## సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**తిరుపతి, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి సహానిధి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో అందించారు. కొర్లగుంట మారుతీనగర్ కు చెందిన జ్యోతి అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా సిఎం సహాయ నిధి నుంచి లక్షా డెబ్బైఆరు వేల రెండు వందల డెబ్బై ఏడు రూపాయలు చెక్కు రాగా ఆమె నడవలేని పరిస్థితి ఉండటంతో ఆమె కుమారుడు ఎమ్మెల్యే నుంచి చెక్ అందుకున్నారు. అలాగే మూడవ డివిజన్ లోని గరుడాద్రినగర్ కు చెందిన కెవై హరినాథ్ ఆచ్చారికి నలభై ఒక్కవేల ఎనభై నాలుగు రూపాయల చెక్ ను ఎమ్మెల్యే అందించారు. కాగా 17వ డివిజన్ పరిధిలోని కొత్తఇండ్లకు చెందిర కె. చెంగల్రాయులుకు లక్షా డెబ్బైరెండు వేల నలభై ఎనిమిది రూపాయలు చెక్ ను ఎమ్మెల్యే అందించారు. అనారోగ్యం కారణంగా ఆర్థికంగా నష్టపోయిన వారికి ఆయా వ్యాధిని బట్టి సిఎం సహాయనిధి నుంచి భాదితులకు ఆర్థిక సాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి నైనార్ మహేష్ యాదవ్, జనసేన నాయకులు జీవకోన సుధాకర్, భాను,వీర తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత నవ సమాజాన్ని నిర్మిద్దాం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పిలుపు...

**సూళ్లూరుపేట, మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణ ప్రాంతంలో గురువారం సూళ్లూరుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ యం మురళి క్రిష్ణ ఆధ్వర్యంలో మాదకద్రవ్య దుర్వినియోగం మరియు వ్యతిరేక దినం సందర్భంగా హెూలీ క్రాస్ సర్కిల్ నుండి బస్టాండ్ ఆవరణంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో, అంగనవాడి వర్కర్లు, పోలీస్ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించి డ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దులి అనే నినాదంతో ప్ల కార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఆవరణంలో మానవహారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం, అన్నారు. గత ప్రభుత్వంలో యువతను గంజాయి కి డ్రగ్స్ కు అలవాటు పడి బంగారు లాంటి జీవితాన్ని నాశనం చేసుకున్నారని అన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారం లోకి వచ్చిన సంవత్సరలో గంజాయి. డ్రగ్స్, నేరాల సంఖ్య తగ్గిందని అన్నారు. యువత చెడు అలవాట్లుకు బానిస కాకుండ మీ కోసం ఎదురు చూసే మీ తల్లి తండ్రులను గుర్తు చేసుకుని మత్తు పదార్థాల ను అలవాటు చేసుకోవద్దని, అన్నారు.డ్రగ్స్ పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతున్నారని, మీ చుట్టుపక్కల డ్రగ్స్ ఉన్నట్టుగానీ, తీసుకుం టున్నట్టు మీకు తెలిసినట్లయితే 1972 నెంబర్ కాల్ చేసి పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరు పేట పట్టణ తెలుగు దేశం అధ్యక్షులు ఆకుతోట రమేష్,ఎ.జి.కిషోర్, లోకేష్ నాయుడు, సతీష్, సుబ్రమణ్యం, మున్సిపాలిటి కమీషన్ ర్ కె. చిన్నయ్య, యం.డి. ఓ. ఏ.వి. మురళి క్రిష్ణ, సూళ్లూరుపేట ఎస్సై. బ్రహ్మ నాయుడు, శ్రీ హరి కోట, తడ ఎస్.ఐ.లు, యం.ఇ. ఓలు. శ్రీ ని వాసులు, సి.డి.పి.ఓ.జ్యోతీకిరణ్, ఉపాధ్యాయులు, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఉమ్మడి చిత్తూరు జిల్లా వార్డు కార్యదర్శులకు బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

### - చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో కౌన్సిలింగ్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్ ను చిత్తూరు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఈనెల 30వ తేదీ లోపల పారదర్శకంగా , ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పూర్తిచేయాలని గ్రామ వార్డు సచివాలయ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగర పాలక సంస్థలు, మదనపల్లి, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగిరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఈ నెల 27, 28 తేదీల్లో బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.27వ తేదీ 10.30 గం నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. ఈనెల 28న ఉదయం 10.30గం నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు కౌన్సిలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## స్వామి వారి సేవలో పాల్గొన్న పలువురు సినీ నటులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వర పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో కోర్టు నటి శ్రీదేవి, హాస్య నటుడు రఘులు కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



## శ్రీ శక్తి పీఠంలో 500 మంది భక్తులకు శ్రీ వారాహి దీక్ష

రామచంద్రపురం, మేజర్‌న్యూస్: మండలంలోని రాయల చెరువు కట్ట వద్ద వెలసియున్న శ్రీ శక్తి పీఠం ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ వారాహి దేవి నవరాత్రులు ఉత్సవాలు కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి దివ్య సమక్షంలో మంత్రి మహేశ్వరి శ్రీ రమ్యానంద భారతి స్వామిని వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా ప్రారంభమైనాయి. ఉదయం పంచామృత అభిషేకం, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నడిచే కాలభైరవ స్వరూపులు జగద్గురువుల వారి ప్రత్యక్ష సన్నిధిలో పరమ పూజ్య శ్రీ మాతాజీ కరకమలములతో 500 మంది భక్తులకు శ్రీ వారాహి దీక్ష నిర్వహించారు. మొదటి రోజు 5000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద విస్తరణ చేయడము జరిగినది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తిపీఠ ఆలయ వ్యవస్థాపకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

**గుడిపల్లి, మేజర్ న్యూస్:** గుడుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ ఎస్ ఎస్), కుప్పం ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, గుడుపల్లి పోలీస్ శాఖ వారు సంయుక్తం గా మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం అనేది కష్టమైన మార్గం.ఇది తరచుగా రుగ్మతలు, వ్యాధులు, మరణంతో ముగుస్తుంది అని కళాశాల ప్రిన్సిపాల్ వై రామక్రిష్ణమ నాయుడు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా దాదాపు 64 మిలియన్ల మంది మాదకద్రవ్యాల వినియోగ రుగ్మతలతో బాధపడుతున్నారు, అయితే ప్రతి సంవత్సరం లక్షలాది మంది మాదకద్రవ్యాల వాడకం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారనీ దాదాపు 14 మిలియన్ల మంది ప్రజలు మందులు ఇంజెక్షన్ ద్వారా చేసుకుంటున్నారని , దీనివల్ల వారికి హెచ్ఐవి, హెపటైటిస్ సి సంక్రమించే అవకాశం చాలా ఎక్కువగా ఉందని.అయినప్పటికీ గత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం పెరిగి యువత చాలా ప్రమాదంలో ఉన్నారు అని ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు తెలిపారు. అక్రమ మాదకద్రవ్యాల మార్కెట్ లో కొత్త మాదకద్రవ్య ధోరణులు, వినియోగ పద్ధతులతో పాల్గొనడానికి వారిని లక్ష్యంగా చేసుకుంటు.అత్యంత శక్తివంతమైన మాదక ద్రవ్యాలు ప్రమాదాలను పెంచుతున్నాయి, అదే సమయంలో కొకైన్ వ్యాపారం కూడా పెరుగుతోందనీ యువత ఎక్కువగా అలవాటు చేసుకునీ ఎక్కువ సవాళ్లను ప్రస్తుతం ఎదుర్కొంటు మాదకద్రవ్యాల అక్రమ రవాణా హింసకు ఆజ్యం పోస్తూ, చట్ట నియమాలను ఉలంగిస్తున్నారని. అదేవిధంగా మాదక ద్రవ్యాలు విషయంలో పండించడం, రవాణా చేయడం ,అమ్మడం, కలిగి ఉండడం, మరియు సేవించడం చట్టరీత్య నేరం. నేటి విద్యార్థులు భావి భారత పౌరులు కావున మనం సమాజ భద్రత మరియు గౌరవంతో జీవించడానికి సాధికారత కల్పించగలము అని గుడుపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసులు తెలిపారు.



# ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

**– ఒకొక్కరికి రూ.6లక్షల జరిమానా**
**– సంచలన తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి**

**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఆరుగురు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 04/2017 కేసులో ఆరుగురు ముద్దాయిలు అరెస్టయ్యారు. వీరు తిరుపతి జిల్లాకు చెందిన చాంద్ బాషా, అవినాష్, మర్రిచెట్టు నాగరాజు, ధనశేఖర్ ఎలియాస్ ధనంజయులు, వరదరాజులు ఎలియాస్ వరదయ్య, మూడే నాగరాజు ఎలియాస్ గుడుంబా నాగరాజు ఎలియాస్ నాగరాజు నాయక్ కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ కరకంబాడీ ఫారెస్ట్ బీటు, టీఏన్ పాలెం సెక్షన్ ఎస్వీఎంపీ తిరుపతి రేంజ్ లో పట్టుబడ్డారు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆరుగురు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

## వైష్ణవి దేవి ఆలయంలో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు

**చౌడేపల్లి రూరల్, మేజర్న్యూస్:** మండలంలోని పుదీపట్ల గ్రామం లో ఉన్న స్వయంభు వైష్ణవి దేవి మాత ఆలయంలో గురువారం వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పాలాభిషేకం అలంకరణ గావించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్మాణకర్త వినోద్కుమార్రెడ్డి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. వారాహి నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజు పలు కార్యక్రమాలు జరుగుతాయని భక్తుల పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



# మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**చిత్తూరు ప్రతినిధి, మేజర్న్యూస్:** మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని,వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది.లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించింది.చిత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం మునిసిపల్ కార్మికులు సమ్మె చేశారు.ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్,టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి సూచనలు సలహాలు మేరకు ఈ సమ్మెలో వాటర్, పార్క్,వెహి కల్ డిపో మెకానికల్, డ్రైవర్లు, క్లీనర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్ట్రీట్ లైటింగ్,పారిశుద్ధ్యం,టౌన్ ప్లానింగ్, డ్రెయినేజీ,మలేరియా విభాగాల కార్మి కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శరవణ మాట్లాడుతూ 36 జీఓ ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు,12వ పీఆర్సీ ప్రకారం మునిసిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.లేని పక్షంలో జూలై నాలుగో తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.శివకుమార్ ,కోశాధికారి కే.ఆర్. శివప్రసాద్ గౌరవ సలహాదారు పి.వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, ఎన్ .వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టి.గోపాలాచారి,ఏ .ఉష యూనియన్ సభ్యులు కే.వీ.సునీల్ కుమార్, పి.శంకర్, ఎస్.పీరుల్లా, ఎం.వేలు, కే.సుజాత, వెంకటేష్ డియ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





# డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం

**– ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ వెంకటేశ్వర్ –తిరుపతిలో ఘనంగా ర్యాలీ**

**తిరుపతి బ్యూరో, మేజర్న్యూస్:** డ్రగ్స్ రహిత జిల్లా కోసం మనమందరం కృషి చేద్దాం అని జిల్లా కలెక్టర్ డా వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమాల నిర్వహణ భాగంగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం నుంచి ఎమ్మార్ పల్లి సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీ లో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్. ఉమ, రిజిస్టర్ ప్రొఫెసర్. రజిని, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సి ముని కృష్ణ తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లా కోసం మనమందరం కృషి చేద్దాం అని తెలిపారు. ముఖ్య మంత్రి జూన్ 26వ తేదీన మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మన రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి నుంచి విముక్తి చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారని గురువారం పిల్లలందరిని ర్యాలీలో భాగస్వామ్యం చేశామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో డ్రగ్స్ అనే మహమ్మారి లేకుండా మనమందరము ఉద్యమంలా కృషి చేయాలని తెలిపారు. అందులో భాగంగా అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. డ్రగ్స్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా సమాచారాన్ని అందరికీ తెలిసేలా మనమందరము భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ అందరి చేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరా చారి, అదనపు కమీషనర్ చరణ్ తేజ రెడ్డి, పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కడ కార్యాలయంలో మరుగుదొడ్లకు ఇబ్బంది..!

**కుప్పం, మేజర్న్యూస్:** కుప్పం ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన కడ కార్యాలయం వసతులు లేక నలుగుతుంది. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భవనాలన్నీ దాదాపు ఒకేచోట నిర్మించారు.కడ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కూడా చేపడుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు వివిధ పనులపై ప్రజలు ఆయా కార్యాలయాలకు నిత్యం అర్జీలు ఇచ్చేందుకు వందలాది మంది వస్తుంటారు.ఈ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మహిళల పరిస్థితి అయితే దారుణంగా ఉంది.కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు సమస్యలతో ఉన్న వారు నివేదించడానికి కడ, ఇతర కార్యాలయాలకి రోజు వందల మంది జనం వస్తూ..ఉంటారు.. ఇక్కడ సరైన వసతులు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి నీరు, కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు..ముఖ్యంగా మరుగుదొడ్లు అధ్వానంగా తయారయింది. మహిళలకు ఉన్న మరుగుదొడ్లును కార్యాలయ సిబ్బంది వాడుకుని మూత పెడుతున్నారు. ఉన్న పురుషుల మరుగుదొడ్లలోనే.. మహిళలు,పురుషులు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉన్న మరుగుదొడ్లలలో సరిగ్గా డోర్ లు..,శుభ్రత లేవని జనం అంటున్నారు.సమస్యలు నివేదించడానికి వచ్చే జనంలో షుగర్ ,బీపీ ఉన్నవారు, వృద్ధులు మూత్ర విసర్జనకు పోలేక ఆపుకుంటూ రోగాల బారిన పడాల్సి వస్తుందని జనం అంటున్నారు.మహిళలకు ప్రత్యేక సదుపాయం లేకపోవడంతో మహిళలు కార్యాలయానికి వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకు మూత్ర విసర్జనకు పోలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా కడ ప్రత్యేక అధికారి స్పందించి జనంకు తాగునీరు, ప్రజలు కూర్చోవడానికి కుర్చీలను,మరుగుదొడ్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలని జనం కోరుతున్నారు.





### పద్మ మహిళా మండలి
## ఆధ్వర్యంలో ఈవినింగ్ స్టడీ సెంటర్



**రేణిగుంట, మేజర్ న్యూస్:**
పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో రేణిగుంటలోని ఆర్.సి.యం పాఠశాలలో బుధవారం పేద విద్యార్థుల సౌకర్యార్థం ఈవినింగ్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రేణిగుంట సర్పంచ్ నగేషం విచ్చేసి ఆయన చేతుల మీదుగా నోట్ బుక్స్, ప్యాడు, పెన్సిల్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మ మహిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రైవేట్ ట్యూషన్ కు వెళ్లలేని పేద విద్యార్థులకు మా వంతు సహాయంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతిరోజు సాయంత్రం స్టడీ సెంటర్లో ఇద్దరు టీచర్లు ఉచితంగా విద్యను బోధిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుమశ్రీ లక్ష్మి, శ్రీను,ఉపాధ్యాయులు శౌరి,చిన్నయ్య,తేజ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : సిఐ

**పెళ్లకూరు, మేజర్ న్యూస్:**



డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదామని నాయుడుపేట రూరల్ సి.ఐ సంఘ మేశ్వర్ రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన పెళ్లకూరు నందు డ్రగ్స్ రహిత కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యువత మత్తు,మాదకద్రవ్యాల వంటివి జోలికి వెళ్లవద్దని వాటికి దూరంగా వుండాలన్నారు. యువత ఇటువంటి వాటి మోజులో పడి, చెడు వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపిందని తెలిపారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా, మంచి నడవడికతో డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని తెలిపారు.మత్తుపదార్థాల వంటివి వాడిన, అమ్మిన కఠిన శిక్షలు ఉంటాయని చెప్పారు. యువత తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, ఆ మాయలో పడద్దని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రమీల రాణి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు,మండల విద్యా శాఖ అధికారి మించల శంకరయ్య, వైద్యాది కారి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పాయిజన్ తీసుకొని మహిళ మృతి

**బంగారుపాళ్యం, మేజర్ న్యూస్:**



చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండల కేంద్రంలోని నలగాంపల్లి గ్రామానికి సమీపంలో శ్యామల యొక్క మామిడి తోపులో కాపలా ఉండి 22.06.2025 వ తేదీ ఇ. పల్లవి వయస్సు 23 సంవత్సరములు, (భర్త) సుధాకర్, భర్త మద్యం సేవించినాడని ఆ విషయంగా పల్లవి భర్తని అడగడంతో ఇరువురు గలాటా పడినట్లు మొదటగా భర్త సుధాకర్ పాయిజన్ తీసుకున్నాడని, పల్లవి ఆ విషయంగా భయపడి పల్లవి కూడా గుర్తు తెలియని విష పాయిజన్ తాగినది. పల్లవి సొంత గ్రామం జగమర్ల,పలమనేరు మండలం. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. పల్లవి ప్రభాకర్ ఇరువురు విష పాయిజన్ తీసుకోవడంతో వీరిని బంగారు పాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చినారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళినారు. అక్కడ భర్త ఎం. సుధాకర్ అతనికి ఎటువంటి ప్రమాదం లేకుండా కోలు కున్నాడు.పల్లవి కోలుకోలేక గురువారం ఉదయం 5.50 నిమిషములకు చనిపోయినది.ఈ కేసును బంగారు పాల్యం ఏఎస్ఐ పి.రామచంద్రారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### నేటి నుంచి
## ధర్మరాజుల ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

**కార్వేటి నగరం మేజర్ న్యూస్:**



కార్వేటి నగరం లో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో నేటి నుంచి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న ధ్వజావరోహణం, పాండవుల జననం హెూబేదాతలు యాదవ కులస్తులు, 28న పాండవుల విద్యాభ్యాసం ఉభయ దాతలు వడ్డీ కులస్తులు, 29న లక్క గృహ దహనం రజక కులస్తులు, 30న బకాసుర వధ విశ్వబ్రాహ్మణ కులస్తులు, ఒకటిన ద్రౌపతి కళ్యాణ మహెూత్సవం, రెడ్డి కులస్తులు, 2న ద్రౌపతి దేవి మాన సంరక్షణ, క్షత్రియ కులస్తులు, 3న రథోత్సవం కరుణిక కులస్తులు, 4న కీచక వధ, అర్జునుని తపస్సు పల్లి రెడ్డి వన్నెకుల క్షత్రియ కులస్తులు, 5న దృశ్యాసన దుర్యోధన సంహరణము తూర్పు వీధి కులస్తులు, 6న అగ్నిగుండ ప్రవేశం బలిజ కులస్తులు తోట విజయ నాయుడు కుటుంబ సభ్యులు, 7న వసంతోత్సవం ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం రెడ్డమ్మ భాగవతా దారినిచే హరికథ కాలక్షేపం, ప్రతి రోజు రాత్రి వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన, ప్రతిరోజు ఆలయం వద్ద మధ్యాహ్నం ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయి రాయల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కాణిపాకం ఆలయ ఉద్యోగి మృతి





**ఐరాల మేజర్ న్యూస్:**
కాణిపాకం దేవస్థానంలో ఔట్ సోసింగ్ ఉద్యోగి ప్రకాష్( 30) గురువారం ఉదయం విధులు కు మోటార్ బైక్‌లో వస్తుండగా కారు ఆటో ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు.స్థానికులు కథనం మేరకు వివరాలు ఇలాఉన్నాయి. ఐరాల మండలం ఎర్రెపల్లి గ్రామ పంచాయతీ మామిడి గుంట పల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ (30) అనే కాణిపాకం దేవస్థానంలో ఔట్ సోసింగ్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్నాడు. అదేవిధానంగా గురువారం ఉదయం విధులు నిమ్మితం మోటార్ బైక్‌లో మండల పరిధిలోని యం.పైపల్లి వద్ద వెళ్ళుతుండగా ఎదురుగా కారు ఆటో ఢీకొన్న ఘటనలో ప్రకాష్ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కాణిపాకం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమ్మితం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుపారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ చేపట్టిన రేణిగుంట పోలీసులు




**రేణిగుంట, మేజర్ న్యూస్:**
అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రేణిగుంట పోలీసులు ఆధ్వర్యంలో తిరుపతి రేణిగుంట మార్గం ఫ్లైఓవర్ నుండి పట్టణం వరకు ప్రజలతో కలిసి డ్రగ్స్ వద్దు ఆరోగ్యం వద్దు, మత్తుతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు అంటూ... ప్లకార్డులు చూపుతూ భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి , వై శ్రీనివాస్ రావు అర్బన్ సీఐ జయ చంద్ర మాట్లాడుతూ యువతీ యువకులు మత్తు పదార్థాలకు బానిసైతే వారితోపాటు సమాజం కూడా నాశనం అవుతుంది అని దాని వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డును పడుతుంది కనుక ప్రజల్లో అవగాహన కల్పించేందుకు..మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ ప్రభుత్వ ఆదేశాలతో చేపట్టామని తెలిపారు.

## బాలిక అదృశ్యం - కేసు నమోదు

**పెద్దపంజాణి,మేజర్ న్యూస్:**



పెద్దపంజాణి మండలం నాగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన పూజిత(17) ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టు పక్క గ్రామాల్లో బాలిక బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పూజిత తల్లి రాధమ్మ గురువారం సాయంత్రం పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనంజయరెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి లేక నేరేడు మార్కెటా



**చౌడేపల్లి రూరల్, మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం మార్కెట్ ను తలపిస్తుంది. ఇక్కడ ఒక ప్రక్క ప్రైవేటు వాహనాలు పార్కింగ్ ఎక్కువ గా ఉండగా దానికి తోడు నేరేడు పళ్ళు మార్కెట్ నడుపుతున్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆసుపత్రిలో నేరేడు పండ్ల మార్కెట్ను నిషేధించాలని వారు కోరుతున్నారు.

### డిగ్రీ తరగతులు రద్దు..!

### ఐఆర్ఎమ్ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి సహకరించండ

**కుప్పం, మేజర్ న్యూస్:** ఐ.ఆర్.ఎమ్ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు,వారి తల్లిదండ్రులు సహకరించాలని కళాశాల చైర్మన్ బి.ఎం దయానిది పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు ఉన్న కళాశాలల గుర్తింపు రద్దు కాగలదని తెలిపారు.తమ కళాశాలలో గత రెండు, మూడు సంవత్సరాలుగా ప్రవేశాలు తగ్గాయన్నారు. విశ్వవిద్యాలయ నియమ నిబంధనల ప్రకారం తమ కళాశాల గుర్తింపు రద్దు అయ్యే అవకాశం ఉందని, కావున తమ కళాశాలలో డిగ్రీ ద్వితీయ,తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రత్యామ్యాయంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించబడ్డ ఇతర కళాశాలలో ప్రవేశం పొందాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు తమ కళాశాల అభివృద్ధికి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటినగరం మేజర్ న్యూస్:**

కార్వేటి నగరం మేజర్ పంచాయతీ బాలాజీ కాలనీ వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లతా బాలాజీ, ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కోశాధికారి చిరంజీవి రెడ్డి, గౌతమ్ రాజు కమిటీ సభ్యులు భక్తులు అధ్యక్ష సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి ఆలయం పేరుతో గేమింగ్ యాప్ తయారుచేసిన తమిళనాడుకు చెందిన రోబ్లెక్స్ సంస్థ

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల యాత్రపై గేమింగ్ యాప్ సృష్టించి భక్తులను మోసగిస్తున్న కంపెనీపై టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకి జనసేన తిరుపతి నాయకుడు కిరణ్ పిర్యాదు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కిరణ్ రాయల్ కోరారు. దీనిపై స్పందించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెంటనే చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. తిరుపతి నుండి తిరుమల ప్రయాణం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి శ్రీవారి ఆలయం, దైవదర్శనం చేసుకొనే దృశ్యాలతో యాప్ ను కంపెనీ రూపొందించిందని దైవ భక్తిని...అదును చేసుకొని డాలర్స్ రూపంలో అన్ లైన్ లో వసూలు చేసినట్లు మాకు ఫిర్యాదు అందిందని స్పష్టం చేశారు. స్వలాభం కోసం తిరుమల దృశ్యాలతో అక్రమాలను పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





## మామిడి రైతులకు సబ్సిడీ పై అవగాహన కల్పించండి : చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** తోతాపురి మామిడి రైతులను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.4 ల ఆర్థిక సహాయంను రైతులకు అందేలా చూడాలని మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, తహశీల్దార్లు చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మామిడి అమ్మకం, ప్రభుత్వ సబ్సిడీ వివరాల పై గురువారం ఆర్ డి ఓ లు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో గతంలో పండే దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల మామిడిని వ్యాపారవేత్తలు నేరుగా మామిడి తోటలకే వెళ్ళి కొనుగోలు చేసే వారని, ప్రస్తుతం ర్యాంప్ ల వద్ద కొనుగోలు తగ్గిందన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో మామిడి గుజ్జు పరిశ్రమలు లేవని, ఈ కారణంగా జిల్లాలోని ఇతర మామిడి గుజ్జు పరిశ్రమల వద్దకు రైతులు పోటెత్తుతున్నారన్నారు. మామిడి కాయల దిగుబడి పెరిగి డిమాండ్ తగ్గడంతో మార్కెట్ లో మామిడి కాయల ధర తగ్గిందన్నారు. ప్రస్తుత పరిస్థితి కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు అండగా మార్కెట్ ధరకు అదనంగా రూ.4 లను రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. మండలాలలో గల ర్యాంప్ లను మండల వ్యవసాయ, ఉద్యాన, సెరి కల్చర్ అసిస్టెంట్లు సందర్శించాలన్నారు. షిఫ్ట్ ల ప్రకారం పని చేయు సిబ్బంది ర్యాంప్ ల వద్ద రైతులు



జరుపుతున్న అమ్మకం వివరాలను నిర్దేశించిన ప్రోఫార్మాలలో పూరించి కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ క్రాప్ తో సంబంధం లేకుండా సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం అందించనున్న రూ.4 సబ్సిడీని సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే రూ.4 సబ్సిడీ పొందడానికి రైతులు మామిడి కాయలను కోసిన తరువాత గుజ్జు పరిశ్రమలకు, మండీలకు, ర్యాంపులకు తరలించిన యెడల గుజ్జు పరిశ్రమలు, మండీలు, ర్యాంపుల వద్ద నియమించిన అధికారులకు రైతు పాస్ పుస్తకము, ఆధార్ కార్డు బ్యాంక్ వివరాలను ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. రైతు స్వయంగా మామిడి తోట నుండి నేరుగా తమ పంటను వేరే రాష్ట్రాలకు సరఫరా చేసినా కూడా వివరాలను రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమాచారం ను విలేజ్ అగ్రికల్చర్, హార్టి కల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** ఎస్ వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మాదకద్రవ్యా దినోత్సవం, నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ వి హర్షవర్ధన్ రాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై ప్రత్యేక దృష్టి పెడితే జీవితం మాధుర్యంగా ఉంటుందని... డ్రగ్స్ పై దృష్టి పెడితే జీవితం చేదుగా ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్క యువత గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం తిరుపతి లోని ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. డ్రగ్ అనేది ఒక రాష్ట్ర సమస్య కాదని... ఇది జాతీయ సమస్యగా మారిందన్నారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు ఎవరైనా సేవిస్తున్నప్పుడు... వెంటనే దానిని నివారించడానికి పోలీసువారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇది పోలీసు ఒక్కరే నివారిస్తారనుకుంటే అది చాలా తప్పు అన్నారు. డ్రగ్స్ ను నివారించాలంటే సమిష్టి కృషితోనే అది సాధ్యమవుతుందన్నారు. మనమందరం కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి డ్రగ్స్ ను నివారించడానికి చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సేవించే వారిని డ్రగ్స్ తీసుకున్న వారిని మనం దూరంగా పెట్టవద్దన్నారు. డ్రగ్స్ సేవించే వారిని చూసి ప్రతి ఒక్కరూ వాళ్ళను క్రిమినల్స్ లాగా చూడవద్దన్నారు. మన వంతుగా డ్రగ్స్ సేవించే వారిలో మార్పు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నేను కడప జిల్లాలో ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో కొంతమంది వైద్య విద్యార్థులు డ్రగ్స్ తీసుకున్నారని సమాచారం రావడంతో నేనే స్వయంగా వెళ్లి వారిని విచారించానన్నారు.



అయితే వైద్య విద్యార్థులు ప్రధానంగా తమ నోటీసులు తీసుకువచ్చింది.. ఎగ్జామ్స్ లో ఫెయిల్ అయిన సమయంలో ప్రతి ఒక్కరూ తమను ఒక విధమైన చూపులతో చూడటం వల్ల డ్రగ్స్ బానిసలు అయ్యామని చెప్పడంతో కొంత ఆశ్చర్యమేసిందన్నారు. కాలేజీకి వస్తున్న సమయంలో టీచర్స్ కూడా విద్యార్థి నడవడిక ఎలా ఉందనే విషయాన్ని గమనిస్తూ ఉండాలని అలా చేసినప్పుడే విద్యార్థి ఏం చూస్తున్నాడనేది మనకు అర్థం అవుతున్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. మంచి వాళ్లతో సహవాసం ఐతే భవిష్యత్ మంచిగా ఉంటుందని... చెడు వాళ్ళతో సహవాసం అయితే జీవితం చెడుగా మారుతున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ నివారణ కార్యక్రమానికి అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ పూర్తిగా నివారించడంలో కొంత జాప్యం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ అనే సంస్థను స్థాపించి గంజాయి, డ్రగ్స్ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. తిరుపతి జిల్లాలో ఈగల్ టీం 24/7 పనిచేస్తుందన్నారు. గంజాయి విక్రయించే వారి పైన గంజాయి సేవించే వారి పైన ప్రత్యేక దృష్టి పెట్టమన్నారు.అంతే కాకుండా అధునాతనమైన డ్రోన్ సహాయంతో అనేక ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గంజాయి మత్తు ఇంజక్షన్స్ ఉపయోగిస్తున్న వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇదిలా ఉంటే ఇలా మెడికల్ షాప్ యజమానులతో కూడా సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా టాబ్లెట్స్ అడిగితే ఇవ్వవద్దని చెప్పమన్నారు. పోలీసువారిని ఇబ్బందులు ఎవరు అతిక్రమించినాలాంటి వారిపై చర్యలు తప్పు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీలత మహిళా డీ.ఎస్,పి., రామకృష్ణ చారి ట్రాఫిక్ డిఎస్ పి ట్రాఫిక్, తమీమ్ అహమ్మద్ సీఐ, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ జె.రాధా , మానసిక విభాగము అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. మల్లికార్జున్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ మానస మెడికల్ ఆఫీసర్, డాక్టర్ జి మురళి కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, ఎస్ రమణయ్య కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ పీజీ,యూజీ వైద్య విద్యార్థులు, బిఎస్సి నర్సింగ్ విద్యార్థినిలు, పోలీసులు డిఎస్పి లు సిఐలు, వైద్య సిబ్బంది, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.కోటి విరాళం

**తిరుమల, మేజర్‌న్యూస్:** గూగుల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్ టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళంగా అందించారు.ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు.ఈ సందర్భం గా దాతను చైర్మన్ అభినందించారు.





## స్వామి వారి సేవలో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వర విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

## నారాయణ విద్యార్థులైన జేఈఈ,నీట్ టాపర్లకు కలెక్టర్ అభినందనలు

**తిరుపతి ఎడ్యుకేషన్,మేజర్ న్యూస్:** స్థానిక నారాయణ విద్యాసంస్థల్లో చదివి జేఈఈ అడ్వాన్స్,అలాగే నీట్ పరీక్షల్లో జిల్లా నుండి జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.గురువారం నారాయణ తిరుపతి శాఖ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు ఆధ్వర్యంలో టాప్ ర్యాంకులు సాధించిన జేఈఈ అడ్వాన్సుడ్ విద్యార్థులు భానుచరణ్ రెడ్డి (51), మణిదీప్ రెడ్డి (345),హిమేష్ రాఘవ (468),శశాంక్ రెడ్డి (618),యశ్విత (906), నిఖిల్ (1056) టాప్ ర్యాంకర్లుగా నిలిచారన్నారు. అదేవిధంగా నీట్ పరీక్షల్లో జ్ఞానీష 934వ ర్యాంకు,మౌనిక కీర్తి విశ్వక్ అగర్వాల్ లను జిల్లా నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు కలెక్టర్ తన కార్యాలయం నందు అభినందించారు. భవిష్యత్తులో జిల్లాకు అలాగే రాష్ట్రానికి వారి సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లి దండ్రులు, డీన్ లు ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ
దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి
వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు
ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా
తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా
అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116